www.manassakshi.net

# నవ్యాంధ్ర మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

అనంతపురం
25-05-2024
శనివారం

సంపుటి : 04
సంచిక : 146
వెల : రూ.2
పేజీలు : 4




## అమిత్ షాకు లైన్ క్లియర్ చేస్తున్న మోదీ

- అమిత్ షాను ప్రధానిగా చేసేందుకు ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా అడుగులు
- ఇప్పటికే కొందరిని పక్కన పెట్టారు
- నేడో రేపో యూపీ ప్రస్తుత సీఎం యోగి ఆధిత్యనాథ్‌ను సైతం పక్కన పెడతారు.
- బీజేపీలో 75 ఏళ్లు వచ్చినా.. ఆ వయస్సు దాటిన నాయకులంతా తప్పకుండా రిటైర్ కావాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారు.



## బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో కీలక పరిణామం..

- ముగ్గురు పోలీసులపై వేటు
- ఏఎస్సై నారాయణ స్వామి, కానిస్టేబుళ్లు గిరీశ్, దేవరాజును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు
- ఆ పార్టీ గురించి తెలిసినప్పటికీ.. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్
- ఏఎస్పీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అయ్యన్న యాదవ్‌లకు నోటీసులు జారీ
- మరో ఇద్దరు పోలీసులకు మెమోలు జారీ





# రెస్ట్ మోడ్‌లో నేతలు

లండన్‌కు కుటుంబ సభ్యులతో సీఎం జగన్

అమెరికాకు చంద్రబాబు, లోకేశ్.. తాజాగా షర్మిల టూర్

గత వారం భార్య భువనేశ్వరితో కలిసి శనివారం రాత్రి అమెరికా వెళ్లారు.

ఈ నెలాఖరులో తిరిగి ఏపీకి జగన్ చేరుకునే అవకాశం

జూన్ 2న తల్లితో కలిసి షర్మిల వెనక్కి వస్తారని సమాచారం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. భార్య భారతితో కలిసి లండన్ వెళ్లారు. తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.. భార్య భువనేశ్వరితో కలిసి శనివారం రాత్రి అమెరికా వెళ్లారు. ఆయన కుమారుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 16నే కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లారు. ఈ నెల 25, లేదంటే 26న ఆయన తిరిగి వచ్చే అవకాశం ఉంది. చంద్రబాబు వైద్య పరీక్షల కోసం వెళ్లగా, లండన్‌లో చదువుకుంటున్న తన కుమార్తెలను కలిసేందుకు జగన్ వెళ్లారు. జగన్ కూడా ఈ నెలాఖరులో తిరిగి ఏపీ చేరుకుంటారు. తాజాగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కూడా అమెరికా వెళ్లారు. కుమారుడు వైఎస్ రాజారెడ్డి, అక్కడే ఉన్న తల్లి వైఎస్ విజయమ్మను కలిసేందుకు వెళ్లారు. కుమారుడు, తల్లితో కొంతకాలం గడిపిన తర్వాత తిరిగి జూన్ 2న తల్లితో కలిసి షర్మిల వెనక్కి వస్తారని సమాచారం. రెండుమూడు నెలలుగా ఎన్నికల ప్రచారం, -మిగతా3లో



## కూటమి విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
- ఎన్నికల అనంతరం కూటమి అధికారం చేపట్టే అవకాశం ఉందని
- ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా నేతలు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి
- కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలి

**అమరావతి**

జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల అనంతరం కూటమి అధికారం చేపట్టే అవకాశం ఉందని పలు విశ్లేషణలు తేటతెల్లం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె వెబ్ ఎక్స్ వీడియో మాధ్యమం ద్వారా రాష్ట్ర కార్యవర్గ సమావేశం -మిగతా3లో



## ఆడబిడ్డలకు రక్షణేది?

- జగన్ నీకు సిగ్గుందా.. ఆడబిడ్డల ఉసురు తగులుతుంది.. షర్మిల సంచలన వ్యాఖ్యలు
- లండన్ వీధుల్లో పొర్లుదండాల మధ్య విహరిస్తున్న మీకు ఇక్కడి ఆర్తనాదాలు వినిపించవు
- ఏలూరు జిల్లాలో పదో తరగతి బాలికపై అత్యాచారం
- ఫేక్ ప్రేమలు నటించే సీఎం గారూ అంటూ ధ్వజమెత్తిన ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు
- సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటన అంటూ విమర్శలు


**అమరావతి**

సీఎం జగన్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో షర్మిల కడప ఎంపీగా పోటీచేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఎన్నికల్లో గెలుపుపై షర్మిల భారీ ఆశలు పెట్టుకున్నారు. జగన్ తనకు సొంత అన్న అయిండి వైఎస్సార్సీపీ కేడర్‌తో అసభ్యంగా తిట్టించారని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఏపీలోని ఓ పాఠశాలలో 13 ఏళ్ల బాలికపై ఆమె సీనియర్ అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనను ఉద్దేశిస్తూ షర్మిల -మిగతా3లో

## పిన్నెల్లి బ్రదర్స్ నరరూప రాక్షసులు

- 20 ఏళ్లుగా మారణహోమం సాగిస్తున్నారు: నారా లోకేశ్
- ఎన్నికల వేళ భగ్గుమన్న మాచర్ల
- ఈవీఎం ధ్వంసం చేసి పరారీలో ఉన్న పిన్నెల్లి
- ప్రజలు, ప్రజాస్వామ్యం బతకాలంటే పిన్నెల్లి బ్రదర్స్‌ను అరెస్ట్ చేయాలన్న లోకేశ్





## వారిని ఇప్పుడు నియమించొద్దు

- యూపీఎస్సీ చైర్మన్‌కు చంద్రబాబు లేఖ
- ఇప్పుడు కూడా జాబితా తయారీలో పారదర్శకత లేదు
- ఏపీలో ఐఏఎస్ కన్ఫర్మేషన్ ప్రక్రియ
- ఇప్పుడు కన్ఫర్మేషన్ చేపట్టడం ఎన్నికల కోడ్ కు విరుద్ధమన్న చంద్రబాబు
- సీఎంవోలో ఉన్నవారికే పదోన్నతులు పరిమితం చేశారని ఆరోపణ
- కొత్త ప్రభుత్వం వచ్చేవరకు కన్ఫర్మేషన్ వాయిదా వేయాలని యూపీఎస్సీకి విజ్ఞప్తి

**అమరావతి**

టీడీపీ అధినేత చంద్రబాబు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కి లేఖ రాశారు. ఐఏఎస్ కన్ఫర్మేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని కోరారు. ఇప్పుడు కన్ఫర్మేషన్ ప్రక్రియ చేపట్టడం ఎన్నికల నియమావళికి విరుద్ధం అని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ఇంకా ముగియనందున ఇప్పుడు కన్ఫర్మేషన్ ప్రక్రియ సరికాదని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. సీఎంవోలో ఉన్నవారికే పదోన్నతులు పరిమితం చేశారని ఆరోపించారు. కన్ఫర్మేషన్ జాబితా తయారీలో పారదర్శకత లేదని విమర్శించారు. ఐఏఎస్ కన్ఫర్మేషన్ జాబితాను పునఃపరిశీలించాలని చంద్రబాబు యూపీఎస్సీకి విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రభుత్వం -మిగతా3లో

# ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేలా సహకరించాలి





**మనస్సాక్షి, అనంతపురం :** సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికలు – 2024 కౌంటింగ్ ప్రక్రియ, తదితర అంశాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎస్పీ గౌతమి శాలితో కలిసి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసిందని, అధికారులు, పోలీసులు కష్టపడి పని చేశారన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ కోసం ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించారని, చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల ఫలితాలను స్పోర్టివ్ గా తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలు అవుతోందని, 133 సెక్షన్ కింద రాళ్లు, రప్పలు, కర్రలు లాంటి ఇతరులకు హాని కలిగించేవి ఎవరూ పెట్టుకోకూడదని, ఎన్నికలు ముగిసే వరకు బాణాసంచా కాల్చడం చేయరాదన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో ఏజెంట్ రూమ్ ఏర్పాటు చేయడం, టవర్ ఏసీలు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిగా చేపడుతున్నామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీల సహకారం అందించాలన్నారు.

### కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదు

ఎన్నికల కౌంటింగ్ లో ఎలాంటి హింసకు తావివ్వరాదని జిల్లా ఎస్పీ గౌతమి శాలి సూచించారు. ఎవరైనా ఎటువంటి హింస సృష్టించినా, సృష్టించాలని చూసినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. లా అండ్ ఆర్డర్ ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీలు లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముఖ్యమైనదని, ఇందుకోసం బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 8 మందిని జిల్లా బహిష్కరణ చేయడం జరిగిందన్నారు. ఎవరైతే గొడవలు చేసేందుకు ఆస్కారం ఉందని గుర్తించామో వారిని బైండోవర్ చేస్తున్నామని, అవి ఇంకా కొనసాగుతాయన్నారు. కౌంటింగ్ కు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును ఖచ్చితంగా స్వాగతించాలని, ఈ విషయం కార్యకర్తలకు కూడా చెప్పాలన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా గెలుపు సంబరాలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సందేహాలు వ్యక్తం చేయగా, వారి సందేహాలను నివృత్తి చేశారు. కౌంటింగ్ కోసం ఏజెంట్లను నియామకం, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కౌంటింగ్ ప్రక్రియలో ఏం చేయాలి, ఏం చేయకూడదు అన్న విధివిధానాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, అడిషినల్ ఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్ఓ రమేష్ రెడ్డి, ఈఆర్ఓ శిరీష, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు






**మనస్సాక్షి, అనంతపురం :** ఉమ్మడి జిల్లాలో గత 16 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను అతున్నత ప్రమాణాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ కమిటీ ఏ గ్రేడ్ గుర్తింపును ఇచ్చింది. దేశంలోని ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించడానికి యూ జీ సి న్యాక్ ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఛైర్మెన్ గా ఒక త్రిసభ్య కమిటీ పీవీకేకే కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ నిపుణులు విద్యార్థులతో, బోధన మరియు బోధనేతర సిబ్బంది తో, పూర్వ విద్యార్థులతో, తల్లిదండ్రులతో, యాజమాన్యంతో సంభాషించి వీరందరి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్య, వసతులు, విద్యార్థుల ప్రతిభ పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అమలు, విద్యా బోధన స్థాయి, పరిశోధన దిశగా పురోగతి, మౌలిక సదుపాయాలు, విద్యార్థి పురోగతి, కళాశాల విశ్వసనీయత, అత్యున్నత ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నత విద్య అర్హతలు కలిగిన ఆచార్యుల నిష్పత్తి తదితర పలు అంశాలను పరిశీలించి పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు ఏ గ్రేడ్ కళాశాలగా గుర్తింపునిచ్చారు. ఈ కమిటీ కళాశాలలో విద్యార్థుల అభివృద్ధి కొరకు అవలంభిస్తున్న పీవీకేకే ఐటీ హానర్స్ సొసైటీ, విద్యార్థులలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించే క్యాంపస్ రేడియో, ఐడియా క్లబ్ లను ప్రత్యేకంగా అభినందించారు. 700 కు పైగా కంప్యూటర్స్, లైబ్రరీలో 43వేల పైచిలుకు వివిధ పుస్తకాలు, ప్రతి తరగతికి ఒక ప్రొజెక్టర్, విశాలవంతమైన తరగతి గదులు కలిగి పచ్చనిచెట్ల నడుమ సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కళాశాల భవనాలను గమనించి అభినందించారు మరియు గత 5సంవత్సరాలుగా పెరుగుతున్న ప్లేస్మెంట్స్, ఉత్తమ స్థాయి ప్రయోగశాలలు , క్రీడా ప్రాంగణాలు, వ్యాయమ శాలలు, మొదలగు సౌకర్యాలను చూసి ప్రశంసించారు. కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్ మాట్లాడుతూ అతి త్వరలో పీవీకేకే ఐటీ అటానమస్ కళాశాల గా గుర్తింపు పొందుతోందని తెలియజేశారు.

## అనంతపురం ప్రజలు అప్రమత్తంగా ఉండండి



**మనస్సాక్షి, అనంతపురం :** వాతావరణ శాఖ ముందస్తు సమాచారం మేరకు రాబోయే మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు, పిడుగులు పడే సూచన ఉన్నాయని అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ తెలిపారు. ఈ నేపథ్యంలో అనంతపురం నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉన్నటువంటి ప్రజలకు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. భారీ వృక్షాలు ఉన్నచోట వాటి కింద ఉండరాదని తెలియజేశారు. నగరవాసుల కోసం సహాయ చర్యలకై నగరపాలక సంస్థ హెల్ప్ లైన్ కేంద్రం (08554-274765, 230234) సంప్రదించాలని కోరారు.

## కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు



**మనస్సాక్షి, హిందూపురం :** బిట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి అరుణ బాబు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కదిరి ఆర్ ఓ వంశీకృష్ణ, మడకశిర నియోజకవర్గం ఆర్వో గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జూన్ 04వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా లాగ్ బుక్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం




**మనస్సాక్షి, గుమ్మఘట్ట :** నాణ్యమైన వేరుశనగ విత్తనాలను రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం గుమ్మగట్ట మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాము వద్ద వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 0 – 0.5 ఎకరాలు ఉన్న రైతుకు 30 కేజీల బ్యాగ్ ఒకటి, 0.5– 1.0 ఎకరాలు ఉన్న రైతుకి 30 కేజీల బ్యాగులు రెండు, 1.01 ఎకరాల పైనున్న వారికి 30 కేజీల వేరుశనగ విత్తనాల బ్యాగులు 3 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతుకు విత్తన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వేరుశనగ విత్తనాలను పంపిణీ కేంద్రంలో స్లాట్ పద్ధతిలో రైతులకు పంపిణీ చేయాలని, దీని ద్వారా విత్తన పంపిణీ కేంద్రంలో హడావిడి ఉండదన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా విత్తనాల పేమెంట్ చేయాలన్నారు. రైతులకు ఎక్కువ విత్తనం అవసరం ఉంది అని ముందుగా చెబితే అదనంగా విత్తనాలు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేరుశనగ విత్తన పంపిణీకి సంబంధించి ఆల్ ఇండియా రేడియోలో లైవ్ కార్యక్రమం పెట్టాలని, రైతుల సందేహాలు, ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీకి ఫ్లయింగ్ స్క్వాడ్ నియామకం చేయాలని, జాయింట్ కలెక్టర్ ఒక బృందం, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల నుంచి స్క్వాడ్ పెట్టాలని, స్క్వాడ్ యూనిట్లలో పర్యటించి విత్తనాలు నాణ్యతగా ఉన్నాయా లేదా అనేది నివేదిక ఇవ్వాలన్నారు. రైతులు ఏ పంట మీకు ఉపయోగంగా ఉంటుంది అనేది వ్యవసాయ అధికారులకు తెలపాలన్నారు. పంట మార్పిడి వల్ల రైతుకు ఉపయోగం ఉంటుందని, రాబోయే రోజుల్లో ప్రతి మండలం, గ్రామాల్లో ఈ విషయమై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. గుమ్మగట్ట మండలానికి 4,600 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని కేటాయించడం జరిగిందని, వేరుశనగ విత్తనాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓ రాణిసుస్మిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడిఏ లక్ష్మీ నాయక్, ఏవో నిర్మల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన కాయలు పంపిణీ చేసిన ఏవో వీరస్వామి



**మనస్సాక్షి, నార్పల:** రైతులకు విత్తన వేరుశెనగ కాయల పంపిణీని మండల వ్యవసాయ అధికారి చిన్న వీరస్వామి శుక్రవారం ప్రారంభించారు. విత్తన వేరుశనగ కాయల పంపిణీ మొదటి రోజున 1472 మంది రైతులకు 1375 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనకాయలు పంపిణీ చేసినట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు శనివారం కూడా విత్తన కాయలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విత్తన కాయల పంపిణీలో శ్రీజ, అనూష, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీవీకేకే ఐటి పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జాబ్ అచీవర్స్ డే




**మనస్సాక్షి, అనంతపురం :** రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐటి పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం వివిధ కంపెనీల ద్వారా ఎంపికైన ఈసీఈ , ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగానికి చెందిన పివికెకె ఐటి పాలిటెక్నిక్ విద్యార్థిని, విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు. ముఖ్య అతిథిగా శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిషోర్, ఎం .జి బ్రదర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మానేజింగ్ డైరెక్టర్ అధిత్య మధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా బోధనా సరళి ఏర్పాటు చేశామన్నారు. తద్వారా ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు సొంతం చేసుకుంటున్నాడని తెలిపారు. అధిత్య మధాని మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థులు పట్ల ఇంత శ్రద్ధ కనపరచి వారి భవిష్యత్తు తీర్చిదిద్దుతున్న కళాశాల సిబ్బంది ని అభినందించారు. విద్యార్థుల ఉన్నతికి తన తరపు మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కళాశాల పిన్సిపాల్ డాక్టర్ జి.యన్.యస్ వైభవ్ మాట్లాడుతూ విద్యార్థిలకు మరి ఎన్నో కంపెనీలను, ఎన్నో అవకాశాలు కల్పిస్తామన్నారు.

## 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్ నియామకం



**మనస్సాక్షి, అనంతపురం :** అనంతపురం కలెక్టరేట్ లోని ఎన్ఐసి భవనంలో శుక్రవారం కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు – 2024 కౌంటింగ్ కోసం పారదర్శకంగా కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ కోసం 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్ ని నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల కమీషన్ కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ కోసం ప్రత్యేక సాఫ్ట్ వేర్ ను అభివృద్ధి చేయడం జరిగిందని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సీపిఎంఎస్ సాఫ్ట్ వేర్ లో ఆన్ లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్ఓ రమేష్ రెడ్డి, ఈఆర్ఓ శిరీష, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ అంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## హింసకు తావివ్వకుండా ముందు జాగ్రత్తలు తీసుకోండి




**మనస్సాక్షి, శింగనమల :** కౌంటింగు రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. శింగనమల, బుక్కరాయ సముద్రం పోలీసు స్టేషన్‌లను గురువారం రాత్రి ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, అక్కడి తాజా పరిస్థితులపై ఆరా తీశారు. ఇంకా ఎవర్నైనా బౌండోవర్ చేయాల్సి ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. క్రిటికల్ గ్రామాలను తరుచూ సందర్శించి సమస్యలు ఉత్పన్నం కాకుండా, గ్రామాలలో ప్రశాంతత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్ పెట్రోలింగ్ లు, గ్రామసభలు, కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కౌంటింగు, ఆ తర్వాత కూడా గ్రామాల్లో హింసకు తావులేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ గారు ఆదేశించారు. బుక్కరాయసముద్రం సి.ఐ వెంకటేశులు, శింగనమల ఎస్సై చంద్రశేఖర్ పోలీసుస్టేషన్ తనిఖీల్లో పాల్గొన్నారు.

# పగలు సెగలు

**నెల్లూరు :** నెల్లూరు పొలిటికల్ గ్రౌండ్ లో విమర్శల బౌలింగ్ కొనసాగుతుంది. అధికార, ప్రతిపక్ష నేతలు కౌంటర్లతో బౌర్సర్లు విసురుకుంటున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా ఆ దూకుడు కొనాగుతూనే ఉంది. బెంగుళూరు రేవ్ పార్టీతో మంత్రి కాకాణి పేరు ఫోకస్ అయి జిల్లా రాజకీయం మరోసారి వేడెక్కింది. మామూలుగానే మంత్రి కాకాణి, మాజీ మంత్రి సోమిరెడ్డిల మధ్య వ్యవహారం పందెం కోడిపుంజుల్లా ఉంటుంది. ప్రస్తుతం రేవ్ పార్టీకి సంబంధించి ఆ ఇద్దరు నేతల సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఇప్పుడా మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. బెంగుళూరులో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే స్టిక్కర్‌తో ఉన్న కారు దొరకడం జిల్లాలో దుమారం రేపుతోంది.బెంగుళూరులో జరిగిన రేవ్ పార్టీ ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపుతుంది. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో పెద్ద రచ్చకు కారణమైంది. పోలింగ్ పూర్తైా నేతలంతా గెలుపోటముల లెక్కలతో సైలెంట్ అయిన తరుణంలో ఎక్కడో కర్ణాటకలో జరిగిన రేవ్ పార్టీతో సంబంధాలు ఉన్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి బురద అంటుకోవడం రాజకీయ రగడకు తెరలేపింది. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పదునైన విమర్శలు, ఆరోపణలో కాకాణి గోవర్ధనరెడ్డిని టార్గెట్ చేస్తున్నారు. దీంతో జిల్లా రాజకీయం హాట్ హాట్‌గా తయారైంది.ఎన్నికలయ్యాక బెట్టింగులపై దృష్టి పెట్టిన బెట్టింగ్ రాయుళ్లు కూడా వాటిని పక్కన పెట్టి రేవ్ పార్టీ గురించి అందులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రమేయం గురించి మాట్లాడుకుంటున్నారంటే అది ఎంత హాట్ టాపిక్‌గా మారిందో అర్థం చేసుకోవచ్చు. మంత్రి కాకాణి , మాజీ మంత్రి సోమిరెడ్డిల మధ్య మాటల యుద్ధం ఆ రేంజ్‌లో నడుస్తుంది. బెంగళూరు శివారు ప్రాంతంలో జరిగిన రేవ్ పార్టీకి, కాకాణి గోవర్ధన్ రెడ్డికి సంబంధం ఉందని కాకాణి కనుసన్నల్లోనే అది జరిగిందంటున్నారు సోమిరెడ్డి.. రేవ్ పార్టీలో కాకాణి కారు, పాస్ పోర్ట్ దొరికాయని.. అయినా తనకు నకే సంబంధం లేదని కాకాణి అనడం సరికాదని నేరం చేసినవాడు ఒప్పుకుంటాడా? అంటూ ప్రశ్నిస్తున్నారుకేంద్రం జోక్యం చేసుకొని కాకాణిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. కల్తీ మద్యం, నకిలీ డాక్యుమెంట్స్ కేసుల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి సూత్రధారి అని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రేవ్ పార్టీతో మరింతగా అవినీతి ఊబిలో కూరుకుపోయిన కాకాణిపై జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. నేరాలు చేసి ఎప్పుడు అడ్డంగా దొరికిపోయినా.. తాను చేయలేదని బుకాయించడం కాకాణికి మొదటి నుంచి అలవాటేనని ఘాటుగా విమర్శించారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలోని 518 మంది ఎమ్మెల్యేలు ఉండగా వారిలో ఎవరి స్టిక్కర్ తోనూ దొరకని కారు ఒక్క కాకాణి గోవర్ధన్ రెడ్డి స్టిక్కర్‌తో ఉన్న కారు మాత్రమే దొరకడాన్ని అందరూ గమనిస్తున్నారన్నారు.టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలకు మంత్రి కాకాణి అదే రేంజ్‌లో కౌంటర్ ఇస్తున్నారు ? తనకు సంబంధించిన వాళ్ళు, లేదా పార్టీ నిర్వాహకుడితోనూ తనకు సంబంధం ఉందని నిరూపించగలరా? అని సోమిరెడ్డికి ప్రతి సవాల్ విసిరారు. తన పేరుతో ఉన్న ఎమ్మెల్యే పాస్ జిరాక్స్ కాపీనీ కారుకు అంటించుకుంటే తన తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రేవ్ పార్టీతో పాటు రేవ్ పార్టీల గురించి సోమిరెడ్డికి బాగా తెలుసునని ఎద్దేవా చేశారు. గతంలో ఎంతో మంది మహిళలను వేధించిన చరిత్ర సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దేనని ఆరోపించారు. సోమిరెడ్డిని ప్రత్యర్థిగా చెప్పుకోవడానికి కూడా సిగ్గుగా ఉందని ఎద్దేవా చేశారు.తన పాస్‌పోర్ట్ కూడా నెల్లూరులోని తన ఇంట్లోనే ఉందని వివరణ ఇచ్చుకున్నారు. తన పాస్‌పోర్ట్ రేవ్ పార్టీలో దొరికినట్లు జరుగుతున్న ప్రచారంపై కర్ణాటక డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు కాకాణి వెల్లడించారు. గతంలో ఇలాంటి ఆరోపణలు అనేకం చేసి వాటిపై సీబీఐ విచారణ చేయించినా తనకు క్లీన్ చిట్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆధారాలు చూపకుండా బురద చల్లితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మరోసారి సిబిఐ విచారణకు తాను సిద్ధమని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు.సోమిరెడ్డి, కాకాణిల మధ్య సుదీర్ఘకాలంగా రాజకీయ వైరం కొనసాగుతుంది.. 1994లో సర్వేపల్లి నుంచి తొలి సారి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు సోమిరెడ్డి.. మొదటి టర్మ్‌లోనే చంద్రబాబు కేబినెట్లో బెర్త దక్కించుకున్నారు. తర్వాత 1999లో సర్వేపల్లి నుంచి రెండో సారి గెలిచి మంత్రి అయి జిల్లాలో తన రాజకీయ పునాదులు పటిష్టం చేసుకున్నారు .. 2004 నుంచి సర్వేపల్లిలో సోమిరెడ్డికి ఎదురుగాలి వీస్తూనే వస్తుంది .. రెండు సార్లు కాంగ్రెస్ నుంచి పోటీచేసిన ఆదాల ప్రభాకరరెడ్డి చేతిలో ఓడిపోయారు. తర్వాత 2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి బరిలోకి దిగిన కాకాణి గోవర్ధనరెడ్డి ఆయన్ని ఓడించారు.ఈ ఎన్నికల్లో సర్వేపల్లి నుంచి వారిద్దరే తలపడ్డారు. ఆ క్రమంలో వారిద్దరి మధ్య సర్వేపల్లిలో రోజుకో యుద్ధం అన్నట్లు తయారైంది పరిస్థితి.. ప్రస్తుతం రేవ్ పార్టీ ఎపిసోడ్‌తో నెల్లూరు జిల్లా రాజకీయం ఒక్కసారిగా హీట్ ఎక్కింది. పోలింగ్ ముగిసాక ఓటర్ల తీర్పుపై లెక్కలు వేసుకుంటున్న రాజకీయ శ్రేణుల్లో సోమిరెడ్డి, కాకాణిల మధ్య నడుస్తున్న డైలాగ్ వార్ ఆసక్తి రేపుతోంది.

# సిక్కోలులో శిరీషా వర్సెస్ అప్పలరాజు

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా లో ఉన్న నియోజకవర్గాల్లో పలాసపైనే అందరి దృష్టి ఉంది. గత ఐదేళ్లుగా ఈ నియోజకవర్గంలో రాజకీయం గరం గరంగానే ఉంది. నిత్యం విమర్శలు ప్రతి విమర్శలతో అక్కడ పొలిటికల్ డైలాగ్ వార్ నిత్యం వార్తల్లో ఉంటూ వచ్చింది. ఓ వైపు మంత్రి సీదిరి అప్పలరాజు మరో వైపు టీడీపీ అభ్యర్థిని గౌతు శిరీషాకు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో ఈ సారి ఎన్నికలలో గత సారి కంటే పోలింగ్ శాతం పెరగడంతో పలాస ఓటర్లు ఎవరికి పట్టం కట్టారనేది ఆసక్తి రేపుతుంది.పలాస నియోజకవర్గం అంటే గుర్తొచ్చేది సర్దార్ గౌతు లచ్చన్న ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సోంపేట..శ్రీకాకుళం సిటీ నియోజకర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. గౌతు లచ్చన్న కుమారుడు గౌతు శివాజీ ఆయన సైతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శ్రీకాకుళం జిల్లా సోంపేట నియోజకవర్గం నుంచి 4 సార్లు.. పలాస నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఒక సారి టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొంది మంత్రిగా పనిచేశారు.గతంలో ఎప్పుడూ పలాస నియోజకవర్గంలో రాజకీయ విమర్శలు ఒక స్థాయి దాటలేదు. 2019 తరువాత పలాసలో రాజకీయం పూర్తిగా మారిపోయింది. విమర్శలు .. ప్రతి విమర్శలతో రాజకీయం వేడెక్కింది. 2019 ఎన్నికలో గెలిచి వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విమర్శల దాడి పెరిగింది. సిద్ధాంత పరమైన విమర్శల కంటే..వ్యక్తిగత విమర్శలకు వైసీపీ నాయకులు అధిక ప్రాధాన్యత ఇవ్వడం మొదలు పెట్టారు. అదే ఒరవడిని పలాస నియోజకవర్గ వైసీపీ నాయకుడు సీదిరి అప్పలరాజు వంటపట్టించుకున్నారనే విమర్శ కూడా ఉంది. 2019 ఎన్నికలో మొదటిసారిగా సీదిరి అప్పలరాజు పలాస నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.టీడీపీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి గౌతు శివాజీ కుమార్తె గౌతు శిరీషపై సుమారు 15 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అప్పటి నుంచే పలాస లో రాజకీయ వేడి మొదలైంది. మొదటిసారి గెలిచిన సీదిరి అప్పలరాజుకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవి సైతం కట్టబెట్టారు. అసలు గెలిచిన నాటి నుంచే అప్పలరాజు పలాస లో ప్రతీకార రాజకీయాలు మొదలు పెట్టారన్న విమర్శలున్నాయి. పలాస నగరం నడిబొడ్డున ఉన్న స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం తొలగించడానికి ప్రయత్నించడం వివాదాస్పదంగా మారింది.ప్రభుత్వ స్థలం అక్రమించి గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేశారన్న నేపంతో అధికారుల సాయంతో అప్పలరాజు గౌతు లచ్చన్న విగ్రహాన్ని తొలగించేగించేందుకు ప్రయత్నించారు.అయితే గౌతు లచ్చన విగ్రహం ఉన్న స్థలం యాజమాని అది తన సొంత స్థలం అని తన వద్ద ఉన్న పత్రాలు చూపించడంతో మునిసిపాలిటీ అధికారులు వెనుదిరిగారు. కేవలం గౌతు శిరీషా పై అక్కసు తోనే సీదిరి అప్పలరాజు సమరయోధుడ్ని అవమానించడానికి తెగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.మరో వైపు పలాస శ్రీనగర్ కాలనీలోని కోడేలు చెరువు ప్రాంతాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేశారనే నెపంతో శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలని మునిసిపాలిటీ అధికారులు తొలగించడానికి ప్రయత్నించంతో అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. నిర్మాణాల కూల్చివేతని నిరసిస్తూ.. లోకేష్ పలాస వస్తుండగా ఆయన్ని అరెస్ట్ చేయడం వివాదాస్పదమైంది. ఆ క్రమంలో మంత్రి అప్పలరాజు గౌతు శిరీషని, టీడీపీ కేడర్ని ఇబ్బంది పెట్టడానికి కంకణం కట్టుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమైంది. తాజా ఎన్నికల్లో ఆ ప్రభావం అప్పలరాజుకు వ్యతిరేకంగా రిఫ్లెక్ట్ అయిందన్న వాదన వినిపిస్తుంది.ఇదంతా ఒక ఎత్తయితే.. మంత్రి సిదిరి అప్లలరాజు పలాస లో అనేక ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మంత్రి అయిన తరువాత భూముల ఆక్రమణలతో పాటు సూది కొండ, నెమలి కొండలను కూడా నిబంధనలకి విరుద్ధంగా తవ్వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. మంత్రి అప్పలరాజుపై గౌతు శిరీష నిత్యం విమర్శలు గుప్పిస్తునే ఉన్నారు. పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు చేసిన అభివృద్ధి ఏమిలేదని టార్గెట్ చేస్తూ వచ్చారు. మంత్రి భూ ఆక్రమణలు గ్రావెల్ కోసం కొండల అక్రమ తవ్వకాలపై శిరీషా ఆందోళనలు నిర్వహించారు. నామినేషన్ టైంలోనూ ప్రశాంత పలాస కోసం క?షి చేస్తానని ప్రకటించారుఆ క్రమంలో పలాస నియోజకవర్గం లో అటు మంత్రి సీదిరి అప్పలరాజు.. ఇటుగౌతు శిరీషా ల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. గౌతు శిరీషా తనపై చేస్తున్న ఆరోపణలు.. విమర్శలు తట్టుకోలేక మంత్రి అప్పలరాజు ఆమెని వ్యక్తిగతంగా ఇబ్బనీది పెట్టేందుకు.. పలాసలో గౌతు శిరీషా కొత్తగా సొంత ఇంటి నిర్మాణానికి ప్రయత్నిస్తే దానికి కూడా మంత్రి అప్పల రాజు అనేక అడ్డంకులు సృష్టించారు. ఏదేమైనా ప్రశాంతంగా ఉండే పలాసలో ఈ సారి ఎన్నిక ఉత్కంఠభరితంగా మారింది.సిదిరి అప్పల రాజు రాజకీయా లకు రాకముందు కార్డియాలజీ డాక్టర్‌గా మంచి పేరు ఉండేది. ఆర్థికంగా ఇబ్బందిపడే రోగుల ఫీజు మందుల విషయం లో సహాయం చేసేవారనే గుర్తింపు ఉండేది. అలాంటి డాక్టర్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత తనలోని మరోకోణం చూపిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలకు తోడు తన రాజకీయ ఎదుగుదలకు సహకరించిన దువ్వాడ శ్రీకాంత్, హేమబాబుచౌదరి లను పక్కన పెట్టడం కూడా ఈ సారి ఎన్నికలో అప్పల రాజుకి నెగిటివ్ అవుతుందని రాజకీయ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో అప్పలరాజుకి టికెట్ దక్కేలా చేయడంలో దువ్వాడ శ్రీకాంత్, వివేకానంద విద్యాసంస్థ అధినేత మెట్ట కుమారస్వామి కీరోల్ పోషించారు .. అయితే అప్పల రాజు మంత్రి అయిన తరువాత దువ్వాడ శ్రీకాంత్‌ని పక్కనపెట్టేశారు. స్థానికంగా బలమైన అనుచరవర్గం ఉన్న దువ్వాడ శ్రీకాంత్ పలాసకు చంద్రబాబు వచ్చినప్పుడు అనుచరవర్గంతో పసుపు కండువా కప్పుకున్నారు.దువ్వాడ శ్రీకాంత్ ఎఫెక్ట్‌తో అప్పలరాజుకి పలాసలో పెద్ద దెబ్బే పడుందంటున్నారు .. ఎన్నికల ముందు వరకు అప్పలరాజు విజయావకాశాలపై పాజిటివ్ టాక్ వినిపించింది.. అయితే దువ్వాడ శ్రీకాంత్, హేమబాబుచౌదరిలు టీడీపీలో జాయిన్ అయి గౌతు శిరీషకు మద్దతు ప్రచారం చేయడంతో.. ఇప్పుడు సొంత పార్టీ వారే మంత్రి గెలుపుపై పెదవి విరుస్తున్నారు.. గత ఎన్నికల్లో అప్పలరాజు సుమారు 16 వేల మెజార్టీతో గెలిచారు .. 72.9 శాతం పోలింగ్ జరిగిన2019 ఎన్నికల్లో జనసేన, బీజేపీ ఓట్ల చీలిక అప్పలరాజుకుకి ప్లస్ అయింది. అయితే ఈ సారి కూటమి అభ్యర్థిగా గౌతు శిరీష తిరిగి పోటీ చేయడం కలిసి వస్తుందంటున్నారుఈసారి అక్కడ 76.42 శాతం పోలింగ్ నమోదు అయింది. సుమారు 3.07 శాతం అధికంగా ఓటర్లు తమ ఓటును వినియోగించు కున్నారు. అదంతా ప్రభుత్వ వ్యతిరేకతేనని దానికి తోడు మంత్రి అప్పలరాజు వైఖరితో నియోజకవర్గ వాసులు విసిగిపోయి ఉన్నారని ఈ సారి తమ విజయం ఖాయమని టీడీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అదీకాక ఈ సారి మంత్రి సిదిరి అప్పలరాజుకి అత్యంత సన్నిహితంగా ఉన్న వారే ఆయన్ని డబ్బుల పంపకంలో బోల్తా కొట్టించారనే ప్రచారం జరుగుతోంది. మంత్రి సీదిరి అప్పలరాజు కి అత్యంత నమ్మకంగా ఉన్న నలుగురి ప్రధాన వ్యక్తులే ఆ డబ్బులు పంచకుండా నొక్కేశారని వైసీపీ నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి చూడాలి ఈ సారి పలాస ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందో..

# బెజవాడకు రేవ్ పార్టీ లింక్...

**విజయవాడ :** బెంగుళూరు రేవ్ పార్టీ సినీ ఇండస్ట్రీనేకాదు.. తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తోంది. తాజాగా విజయవాడలో రేవ్ పార్టీ మూలాలు బయటపడ్డాయి. రేవ్ పార్టీకి ప్రధాన నిందితుడు వాసు అలియాస్ లంకపల్లి వాసు విజయవాడ వాసి. కొత్తపేటలోని ఆంజనేయవాగుకు చందిన వాసు.. హైదరాబాద్, బెంగుళూరు నుంచి క్రికెట్ బెట్టింగ్ లు నిర్వహిస్తుంటాడు. విజయవాడలోనూ అతిపెద్ద బుకీల నెట్ వర్క్ ను విస్తరించాడు వాసు. బర్త్ డే సందర్భంగా వాసు స్వయంగా బెంగుళూరులోని ఫామ్ హౌస్ పార్టీని ఏర్పాటు చేయగా.. విజయవాడకు చెందిన నలుగురు ప్రధాన బుకీలు మిగిలిన ఏర్పాట్లు చేసినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ లోనే మకాం వేసిన వాసు.. అక్కడి నుంచే మొత్తం వ్యవహారం నడిపించినట్లుగా తెలుస్తోంది.బెంగుళూరు రేవ్ పార్టీ పై పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. పార్టీ నిర్వాహకులు లంక పల్లి



వాసు విజయవాడ వాసిగా గుర్తించిన పోలీసులు.. అతనికి చాలా మంది సినీ సెలబ్రెటీలు, రాజకీయ నేతలతో పరిచయం ఉందని గుర్తించారు. ప్రతి సంవత్సరం వాసు పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగులను సైతం వాసు నిర్వహించేవాడు. ఐపీఎల్ సీజన్ లో కోట్ల రూపాయలు బిజినెస్ జరిగిందని, దీంతో సెలబ్రెటీలతో, రాజకీయ నేతలతో పార్టీకి వాసు ప్లాన్ చేసినట్లు తెలిసింది. గత ఆదివారం బెంగళూరు శివారులోని ఫామ్ హౌస్ లో వాసు రేవ్ పార్టీని ఏర్పాటు చేశాడు. పోలీసులు దాడులు చేసి రేవ్ పార్టీ లో డ్రగ్స్ సీజ్ చేశారు. రేవ్ పార్టీ కి వచ్చిన వారి వద్ద నుండి బ్లెడ్ శాంపుల్స్ తీసుకున్నారు. వాటిని ఈఊఓ కు పంపించారు. డ్రగ్స్ పెడ్లర్స్ తో వాసుకున్న సంబంధాల పై పోలీసులు ఆరా తీస్తున్నారు మరోవైపు సినీనటి హేమ కూడా ఈ రేవ్ పార్టీ లో ఉన్నట్లు పోలీసులు ఇప్పటికే స్పష్టం చేశారు. కానీ, తాను ఆ రేవ్ పార్టీకి వెళ్లలేదంటూ హేమ బుకాయిస్తున్నారు. ఈ మేరకు తాను ఇంట్లోనే ఉన్నట్లు పలు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. మరోవైపు బ్లెడ్ శాంపిల్స్ లో డ్రగ్స్ తీసుకున్నట్లు రూడీ కావడంతో చర్యలు తీసుకొనేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

## సెలవుపై వెళ్లిపోయిన తాడిపత్రి రిటర్నింగ్ అధికారి

**ఏపీలో మే 13న ముగిసిన పోలింగ్**

**పలు చోట్ల హింసాత్మక ఘటనలు**

**ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న ఆర్వోలు**

**ఆరోగ్యం బాగాలేదని సెలవుపై వెళ్లిపోయిన తాడిపత్రి ఆర్వో**

ఏపీలో మే 13న పోలింగ్ ముగిసినప్పటి నుంచి పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, ఆ తర్వాత రోజున జరిగిన హింసాత్మక ఘటనలు తీవ్ర ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. కౌంటింగ్ సందర్భంగా ఇంకెలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, పలుచోట్ల రిటర్నింగ్ అధికారులపై ఒత్తిళ్లు వస్తున్నట్టు తెలుస్తోంది. తాడిపత్రి రిటర్నింగ్ అధికారి రాంభూపాల్ రెడ్డి సెలవుపై వెళ్లిపోవడమే అందుకు నిదర్శనం. ఓవైపు తాడిపత్రి ఘటనలపై సిట్ దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, ఆయన సెలవుపై వెళ్లడం గమనార్హం. తనను ఎన్నికల డ్యూటీ నుంచి తప్పించాలని రాంభూపాల్ రెడ్డి ఇదివరకే ఉన్నతాధికారులను కోరినా, కౌంటింగ్ వరకు కొనసాగాలని ఉన్నతాధికారులు కోరారు. అయితే, తనకు ఆరోగ్యం బాగాలేదంటూ ఆయన మరోసారి సెలవు కోసం విజ్ఞప్తి చేయడంతో, అధికారులు అనుమతించక తప్పలేదు. రాంభూపాల్ రెడ్డి రెండ్రోజులు సెలవు పెట్టినప్పటికీ, కౌంటింగ్ సమయానికి ఆయన విధుల్లో చేరేదీ, లేనిదీ సందేహాస్పదంగా మారింది. పలు జిల్లాల్లో రిటర్నింగ్ అధికారుల పరిస్థితి ఇలాగే ఉందని తెలుస్తోంది.


## పిన్నెల్లి బ్రదర్స్ నరరూప రాక్షసులు...



మాచర్ల నియోజకవర్గంలో ఇటీవలి పరిణామాల నేపథ్యంలో, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. పిన్నెల్లి సోదరులు నరరూప రాక్షసులు అని ధ్వజమెత్తారు. మాచర్ల నియోజకవర్గంలో 20 ఏళ్లుగా మారణహోమం సాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు బతకాలన్నా, ప్రజాస్వామ్యం నిలవాలన్నా వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీకి మద్దతు ఇస్తున్నారన్న కారణంతో ఊర్లకు ఊర్లు తగలబెడుతూ, కుటుంబాలను మట్టుబెడుతోన్న పిన్నెల్లి బ్రదర్స్ అక్రమాలకు చరమగీతం పాడాలని నారా లోకేశ్ ట్వీట్ చేశారు. నోముల మాణిక్యరావు అనే బాధితుడు పిన్నెల్లి సోదరుల అరాచకాల గురించి వివరించిన వీడియోను కూడా లోకేశ్ పంచుకున్నారు.

## వారిని ఇప్పుడు నియమించొద్దు

-మొదటి పేజీ తరువాయి



వచ్చే వరకు కన్ఫర్మేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని కోరారు. యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం లేఖ రాశారు. ఐఏఎస్‌కు రాష్ట్ర కేడర్ ఆఫీసర్ల ఎంపిక కార్యక్రమాన్ని మోడల్ కోడ్ ఉన్నప్పుడు చేయడం సముచితం కాదని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చే వరకు నియమించొద్దని యూపీఎస్సీని చంద్రబాబు కోరారు. వారి ప్రమోషన్స్ ముఖ్యమంత్రి కార్యాలయంలోని వారికే పరిమితం చేశారన్నారు. ఇప్పుడు కూడా జాబితా తయారీలో పారదర్శకత లేదని అన్నారు. ఈ అంశాన్ని పునః పరిశీలించాలని యూపీఎస్సీ చైర్మన్‌ను చంద్రబాబు నాయుడు కోరారు. అయితే ఏపీ సార్వత్రిక ఎన్నికలు అయిపోయన తర్వాత వైద్య పరీక్షల కోసం చంద్రబాబు అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే.. ఆయనకు ఎదురెల్లి టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు అడ్డుకున్నారు. అయితే ఆ తర్వాత అతనిపై పిన్నెల్లి, అతని అనుచరులు గొడ్డళ్లతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. ఆయనను చంద్రబాబు రెండు రోజుల క్రితం అమెరికా నుంచే ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందన్న ధీమాలో చంద్రబాబు ఉన్నారు. విదేశీ పర్యటనను ముగించుకొని నాలుగైదు రోజుల్లో ఏపీకి వస్తారని సమాచారం. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలు, రాష్ట్రంలో ఉన్న పరిస్థితులపై పార్టీ కేడర్‌తో చంద్రబాబు సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

## కూటమి విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు

-మొదటి పేజీ తరువాయి



నిర్వహించారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, బీజేపీ కూటమి గెలిచే అవకాశమే ఎక్కువగా ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో ఆమె ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గానికి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా నేతలు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. పోస్టల్ బ్యాలట్ కౌంటింగ్‌కు 500ఓట్లకు ఒక్కో టేబుల్ చొప్పున ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో కూటమిలో ఉన్న సమన్వయం.. కౌంటింగ్ ప్రక్రియలోనూ చూపించి పని చేయాలని కోరారు. భాజపా, తెదేపా, జనసేన కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## ఆడబిడ్డలకు రక్షణేది..?

-మొదటి పేజీ తరువాయి

ఈరోజు (శుక్రవారం) ఎక్స్(ట్విట్టర్) వేదికగా సీఎం జగన్‌పై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆడబిడ్డలకు రక్షణేది..?**

"జగన్ నీకు సిగ్గుందా.. ఆడబిడ్డల ఉసురు తగులుతుంది. నా అక్కలూ, నా చెల్లెమ్మలు, నా తల్లులూ, నా అవ్వలూ అంటూ జబ్బలు చరిచి.. మైకుల ముందు గొంతు చించుకుని మొసలి కన్నీరు, ఫేక్ ప్రేమలూ నటించే ముఖ్యమంత్రి గారు.. మన రాష్ట్రంలో, మీ పాలనలో మహిళల భద్రతకు, బతుకులకు పట్టిన పీడా, దేశమంతా చెప్పుకుంటోంది. లండన్ వీధుల్లో పొర్లుదండాల మధ్య విహరిస్తున్న మీకు, ఇక్కడి ఆర్తనాదాలు, హాహాకారాలు వినపడవు. రాష్ట్రానికి ఈ అత్యున్నత ర్యాంకులు మీ వల్ల రావు. మీరు, మీ మహిళా మంత్రులు, నాయకురాళ్లు సిగ్గుతో తలవంచుకుంటారో...సిగ్గులేకుండా మిన్నకుండిపోతారో ప్రజలు గమనిస్తున్నారు" అని షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో, మీ పాలనలో మహిళల భద్రతకు, మహిళల బ్రతుకులకు పట్టిన పీడ గురించి దేశమంతా చెప్పుకుంటోంది. రాష్ట్రానికి ఈ అత్యున్నత ర్యాంకులు ఎందులో రావాలో అందులో రావు. మీరు, మీ మహిళా మంత్రులు, నాయకురాళ్లు సిగ్గుతో తలవంచుకుంటారో... సిగ్గులేకుండా మిన్నకుండిపోతారో ప్రజలు గమనిస్తున్నారు" అంటూ షర్మిల సోషల్ మీడియాలో స్పందించారు.

## రెస్ట్ మోడ్‌లో నేతలు

-మొదటి పేజీ తరువాయి

వ్యూహాలతో బిజీబిజీగా గడిపిన వీరంతా ఎన్నికలు ముగిసీ ముగియగానే విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనుండగా, అంతకుముందే వీరంతా ఏపీకి చేరుకుంటారు.

# భైరవానితిప్ప ప్రాజెక్టు మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం




**మనస్సాక్షి, అనంతపురం:** గుమ్మగట్ట మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం బిటి ప్రాజెక్టును పరిశీలించి రైతులు, ప్రజలు, అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ఉపాధి హామీ పథకం కింద కెనాల్ లలో పిచ్చి మొక్కల తొలగింపు, డిసిల్టింగ్ పనులు చేపడతామన్నారు. కెనాల్ ద్వారా చివరి గ్రామం వరకు నీరు వెళ్లేలా తీసుకోవాల్సిన చర్యలను చేపడతామన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని వాణి విలాస్ రిజర్వాయర్ అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ఉండాలన్నారు. రెండు, మూడు రోజులు భారీ వర్షాలు వచ్చే అవకాశం నేపథ్యంలో పలు పంటలు కోతల దశలో ఉన్నాయని, టార్పాలిన్ వాడడం, ఇతర జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అది ఎక్కువ వర్షాన్ని ఎదురుకోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రస్తుతం ప్రాజెక్టులో ఎన్ని క్యూసెక్కుల నీరు ఉంది, ఎంత ఇన్ ఫ్లో ఉంది, ఏయే మండలాలకు నీరు అందిస్తున్నారు, తదితర వివరాలు ఆరా తీశారు. అనంతరం గుమ్మగట్ట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యాలయంలో రికార్డులను పక్కాగా మెయింటైన్ చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రికార్డు గదిని, రిజిస్టర్లను, కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓ రాణిసుస్మిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్. హనుమాపురంలో పోలీసుల కార్డెన్ సెర్చ్




**మనస్సాక్షి, కణేకల్లు:** మండలంలోని ఎన్. హనుమాపురం గ్రామంలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ సర్కిల్ సిబ్బందితో కలిసి సమస్యాత్మక గ్రామమైన ఎన్. హనుమాపురంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆ గ్రామంలోని రౌడీషీటర్లు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో ఆకస్మిక తనిఖీలు చేసి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీలలో కవాతు నిర్వహించి, అక్కడి ప్రజలతో సమావేశం నిర్వహించి ఎటువంటి గొడవలు, అల్లర్ల జోలికెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు పోలీసులకు సహకరించి, శాంతియుతంగా మెలగాలని కోరారు.

## ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి: ఎంపీడీవో గూడెన్న



**మనస్సాక్షి, కణేకల్లు:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని ఎంపీడీవో గూడెన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉడేగోళం గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని గ్రామాలను వారానికి ఒకసారి సందర్శించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, గ్రామాల్లో నీటి నిల్వలను పూర్తిగా తొలగించి దోమలు పెరుగుదలను అరికట్టే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



**మనస్సాక్షి, కణేకల్లు:** కణేకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో గూడెన్న పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, కూలీల నమోదు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వాతావరణ శాఖ ముందస్తు సమాచారం మేరకు రెమాల్ తుఫాన్ హెచ్చరిక ఉన్న కారణంగా రాబోయే మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు మరియు పిడుగులు పడే సూచనలు ఉన్నాయని అన్నారు. మండల వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉన్న ప్రజలు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. భారీ వృక్షాలు ఉన్నచోట వాటి కింద ఉండరాదని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## బంగాళాఖాతంలో 'రెమాల్' తుపాను...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం మరింత బలపడి తుపానుగా మారనుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. తుపానుగా మారితే దీనిని 'రెమాల్' అని పిలవనున్నారు. కాగా, ఈ నెల 25వ తేదీ రాత్రికి తీవ్ర తుపానుగా బలపడి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఈ నెల 25, 26 తేదీల్లో ఉత్తర ఒడిశా తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 26, 27 తేదీల్లో పశ్చిమ బెంగాల్ లోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఈ నెల 28 వరకు బెంగాల్ లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. అదే సమయంలో, ఏపీపై ఈ తుపాను ప్రభావం ఏమాత్రం ఉండదని, రాష్ట్రంలో ఎండలు మండిపోతాయని ఐఎండీ స్పష్టం చేసింది. ఏపీలో వేడి గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించింది.

## బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో కీలక పరిణామం

బెంగళూరులోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా హెబ్బగోడి పీఎస్‌కు చెందిన ముగ్గురు పోలీసులపై వేటు పడింది. ఏఎస్సై నారాయణ స్వామి, కానిస్టేబుళ్లు గిరీశ్, దేవరాజును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రేవ్ పార్టీ గురించి తెలిసినప్పటికీ.. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గానూ వారిని సస్పెండ్ చేశారు. అనేకల్ ఏఎస్పీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అయ్యన్న యాదవ్‌లకు నోటీసులు జారీ చేశారు. మరో ఇద్దరు పోలీసులకు మెమోలు జారీ చేశారు. కాగా, బెంగళూరు రేవ్ పార్టీ ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# ప్రెసిడెంట్ రేసులో ట్రంప్...



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో రిపబ్లికన్ పార్టీ తరఫున డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీ ఇచ్చిన నిక్కీ హేలీ ఎట్టకేలకు ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో తాను ట్రంప్‌కే ఓటు వేస్తానని స్పష్టం చేశారు. హడ్సన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాషింగ్‌టన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈమేరకు ప్రకటన చేశారు. నిక్కీహేలీ అధ్యక్ష రేసులో రిపబ్లిక్ పార్టీ తరఫున నిలిచారు. అయితే వివిధ రాష్ట్రాల్లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ కన్నా తక్కువ ఓట్లు సాధించారు. దీంతో చేసేది లేక పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. చివరకు పార్టీ అభ్యర్థిగా ట్రంప్ ఖరారయ్యాడు. అయితే పోటీ నుంచి తప్పుకున్న నిక్కీ హేలీ.. ట్రంప్ గురించి ఒక్క మాట మాట్లాడలేదు. మద్దతు ఇస్తానని కూడా తెలుపలేదు. దీంతో చాలా మంది ఆమె మద్దతు ట్రంప్‌కు దక్కదని భావించారు. నిక్కీ మద్దతు దారులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడతారేమో అన్న అనుమానాలు వచ్చాయి. కానీ ఎట్టకేలకు ఆమె మౌనం వీడారు. అనుమానాలను పటాపంచలు చేశారు. రిపబ్లికన్ పార్టీ ఏకతాటిపై ఉందన్న సందేశాన్ని ఇచ్చారు. హేలీ మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల రేసులో తనకు అండగా నిలిచిన మద్దతుదారులను ట్రంప్ ఇపుపడు తనవైపు తిప్పుకోవాలని సూచించారు. వారి మద్దతు కూడగట్టడం కోసం ఆయన శ్రమించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. గుడ్డిగా వారంతా తన వెనకాలే ఉంటారని ట్రంప్ అనుకుంటే పొరపాటే అవుతుందని పేర్కొన్నారు. ప్రైమరి ఎన్నికల రేసులో నిలిచిన సమయంలో హేలీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. పోటీ నుంచి తప్పుకున్నాక ట్రంప్‌వైపు నిలబడలేదు. దీంతో రిపబ్లికన్ పార్టీ చీలిపోతుందన్న అనుమానాలు కూడా వచ్చాయి. కానీ ఎట్టకేలకు మద్దతు ప్రకటించారు. కానీ, తన మద్దతుదారులను బైడెన్ తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడని నిక్కీహేలీ తెలిపారు. ఇదిలా ఉండగా, నిక్కీహేలీ అధ్యక్షుడు బైడెన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అమెరికా?మెక్సికో సరిహద్దు వివాదాన్ని ఉదహరిస్తూ బైడెన విదేశాంగ విధానాన్ని తపుప పట్టారు. తన ప్రచారానికి విరాళాలు ఇచ్చిన వారికోసం ఇటీవల ఆమె దక్షిణ కరోలినాలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే తదుపరి రాజకీయ కార్యాచరణ ప్రకటించలేదు.

## మ్యాజిక్ ఫిగర్‌కు దూరంగా బీజేపీ : శశి థరూర్



లోక్‌సభ ఎన్నికల ఐదో దశ పోలింగ్ ముగిసిన అనంతరం దేశవ్యాప్తంగా విపక్ష ఇండియా కూటమికి సానుకూల వాతావరణం ఉన్నట్టు వెల్లడవుతోందని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. బీజేపీ మెజారిటీ మార్క్‌కు దూరంగా నిలుస్తుందని చెప్పారు. ఇది దేశంలో ఏ ఒక్క ప్రాంతంలో కాదని, ప్రతిచోటా ఇదే వాతావరణం ఉందని అన్నారు. తమ అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొనగా, బీజేపీ అభ్యర్థుల్లో నైరాశ్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. బీజేపీకి పట్టున్న ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గుముఖం పట్టిందని, తాము ఎన్ని స్థానాలు దక్కించుకుంటామనే సంఖ్యను వెల్లడించకున్నా ట్రెండ్ మాత్రం ఓ నిర్దిష్ట దిశగా సాగుతున్నట్టు అర్థమవుతోందని అన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే నాడు కేంద్రంలో ప్రభుత్వం మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 303 మంది సభ్యులు ఉండగా, వారు మెజారిటీ మార్క్‌కు చాలా దిగువకు పడిపోనున్నారని, ఎన్డీయే కూటమి పక్షాలు కూడా బీజేపీకి మెజారిటీ సాధించి పెట్టే పరిస్థితి ఉండదని శశి థరూర్ అంచనా వేశారు. లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరగనుండగా ఇప్పటికి ఐదు దశలు పూర్తయ్యాయి. మే 25, జూన్ 1న చివరి రెండు దశల పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

# నా ఆరోగ్యంపై బీజేపీ దుష్ప్రచారం



మయూర్‌భంజ్: భారతీయ జనతా పార్టీపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మండిపడ్డారు. తన ఆరోగ్యంపై బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని, తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెలరోజులుగా తాను ప్రచారం సాగిస్తున్నట్టు తెలిపారు. "అబద్ధాలు చెప్పడానికైనా ఒక హద్దంటూ బీజేపీకి ఉండాలి. నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. అది మీరు చూస్తూనే ఉన్నారు. నెలరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం సాగిస్తూనే ఉన్నాను" అని మయూర్‌భంజ్‌లో మీడియాతో మాట్లాడుతూ నవీన్ పట్నాయక్ అన్నారు.

**అసలేం జరిగింది..?**

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇటీవల ఒడిశాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో 77 ఏళ్ల నవీన్ పట్నాయక్ రిటైర్ కావడం మంచిదంటూ వ్యాఖ్యానించారు. వయసు పైబడటం, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పట్నాయక్ రిటైరు కావాలని, బీజేపీని గెలిపిస్తే ఒడియా మాట్లాడే యువ 'భూమిపుత్రుణ్ణి' ముఖ్యమంత్రిగా చేస్తామని అన్నారు. ఒడిశా రాష్ట్రాన్ని బీజేడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని, ఒడియా ప్రజల గౌరవానికి భంగం కలిగిస్తూ, ఒడిశా సంస్కృతి, ప్రతిష్టను పీకనులుముతోందని ఆరోపించారు. ఒడిశాలో ఎంతో ఖనిజ సంపద, కష్టపడి పనిచేసే యువత ఉన్నప్పటికీ కష్టపడి పనిచేసే ముఖ్యమంత్రి లేడని విమర్శించారు. ఖనిజ సంపదను లూటీ చేసేందుకు నవీన్ బాబు ఏమాత్రం వెనుకాడటం లేదన్నారు. పర్యాటకం పేరుతో ప్రఖ్యాత జగన్నాథ ఆలయం సంస్కృతి, సంప్రదను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని, శ్రీక్షేత్రాన్ని కమర్షియల్ సెంటర్‌గా మార్చాలనుకుంటోందని తప్పుపట్టారు. ఈసారి అటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ, లోక్‌సభ ఎన్నికల్లోనూ కమల వికాసం ఖాయమని, ఐదు విడతల లోక్‌సభ ఎన్నికల్లో మోదీ 310 సీట్లు దాటారని, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లోనూ 75కు పైగా సీట్లు గెలుచుకోనున్నామని చెప్పారు.

Printed, published and owned by Mahammad Munvar Basha, Printed at M/S Anju Publications, #19-2-710, Rajamma Nagar, Old Town, Ananthapuramu - 515001, Ananthapuramu Dist., Andhra Pradesh.
Published at #19-2-710, Rajamma Nagar, Old Town, Ananthapuramu - 515001, Ananthapuramu Dist., Andhra Pradesh. Editor : MAHAMMAD MUNVAR BASHA. RNI No. APTEL/2020/80172 , E-mail : manassakshidaily@gmail.com